
## నేడే ఓయూ బడ్జెట్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 27: ఉస్మానియా యూనివర్సిటీ 2024-25 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను గురువారం జరుగనున్న అకాడమిక్ సెనేట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. ఓయూ పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో జరుగనున్న సమావేశంలో బడ్జెట్‌ను పాలకమండలి సభ్యుడు, కామర్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ అప్పారావు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. గతేడాది రూ.42.64 కోట్ల లోటు బడ్జెట్‌తో ఉండగా, ఈ ఏడాది లోటు మరింత పెరిగేలా ఉందని సమాచారం. లోటును పూడ్చుకునేందుకు వర్సిటీ అధికారులు వివిధ మార్గాలను వెతుకుతున్నట్లు తెలిసింది.

## వ్యక్తి అదృశ్యం

శంషాబాద్ రూరల్, మార్చి 27: వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దషాపూర్ తండాకు చెందిన సభావత్ రాజశేఖర్(27)గత కొంత కాలం నుంచి పని చేయకుండా ప్రతిరోజు మద్యం సేవిస్తున్నాడు. ఈనెల 18న మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి తాళం వేసుకొని పడుకున్నాడు. దీంతో తల్లి లక్ష్మి మందలించడంతో అతడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కనిపించలేదు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటాం



కార్ఖాన కార్యాలయం నుంచి బీఆర్‌ఎస్ నేత నివేదిత ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌కు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

- బీఆర్‌ఎస్ నేత నివేదిత ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌కు పార్టీ కార్యకర్తలు
- గులాబీ జెండాను ఎగురవేసేందుకు శ్రమిస్తామని కార్యకర్తల ప్రతిజ్ఞ

మారేడ్‌పల్లి, మార్చి 27: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఐదు, నాలుగు, మోండా డివిజన్లకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పాలక మండలి సభ్యుడు చొల్లేటి రమేశ్ మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్‌తో పాటు, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయం కోసం పని చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిందని, 100 రోజులు పూర్తి అయినా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, కిరణ్, గంగారాం, రేపాల వెంకటేశ్, నారాయణ, రాము, దేవులపల్లి శ్రీనివాస్, ప్రభుగుప్త పాల్గొన్నారు.

**తెలంగాణ భవన్‌కు తరలిన కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ శ్రేణులు..**

కంటోన్మెంట్: తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరిగిన మల్కాజిగిరి పార్లమెంట్ సన్నాహక సమావేశానికి బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు నివేదిత ఆధ్వర్యంలో నాయకులు భారీగా హాజరయ్యారు. గులాబీ జెండాను ఎగురవేసేందుకు శ్రమిస్తామని ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.



బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు చొల్లేటి రమేశ్, టీఎన్ శ్రీనివాస్ తదితరులు

## సాయిబాబా మందిరం నూతన కమిటీ



నూతనంగా ఎన్నికైన సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు

బన్సీలాల్‌పేట్, మార్చి 27: న్యూబోయిగూడలోని సాయిబాబా మందిరం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు కమిటీ అధ్యక్షుడు బి.మహేశ్ బుధవారం తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షులుగా భగత్ శ్రీను, రాగటి సతీశ్, కుమ్మరి శంకర్, కుర్మ బలరాం, ఎస్వై గిరి, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్ పాండు, సంయుక్త కార్యదర్శులుగా బి.మహేశ్‌గౌడ్, ఆర్.నరేశ్, కోశాధికారిగా జీబీ సాయికృష్ణ, స్టోర్ ఇన్‌చార్జిగా ఎన్.రమేశ్‌బాబు, అన్నదాన కార్యక్రమ ఇన్‌చార్జిగా సీహెచ్ యాదగిరిలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఆలయం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడం, గుడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరిస్తామని కమిటీ పేర్కొన్నది. ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో అందరం కలిసి ఐకమత్యంగా పని చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు.

## 10 నుంచి ఉచిత మితభోజన శిబిరం



అమీర్‌పేట్, మార్చి 27: ఎస్‌ఆర్‌నగర్‌లోని శ్రీశ్రీనివాసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతియేటా వేసవిలో బాటసారుల కోసం మధ్యాహ్న మితభోజన శిబిరం కొనసాగుతుంది. మేనేజింగ్ ట్రస్టీ డి.పార్థసారథి ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు శిబిరాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నారు. ఏప్రిల్ 10న శిబిరాన్ని ప్రారంభించేందుకు రావాల్సిందిగా పార్థసారధి బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కృష్ణారెడ్డి, కృష్ణదేవ్‌గౌడ్, అరవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తలసానిని కలిసిన మేనేజింగ్ ట్రస్టీ డి.పార్థసారథి, ట్రస్ట్ సభ్యులు

## అసలైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందాలి



బస్తీవాసులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీగణేశ్

బొల్లారం, మార్చి 27: కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరి సెంట్రల్ బట్టీ బస్తీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీగణేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులతో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలు అందే విధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాబోయే పార్లమెంట్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రంగా రవీందర్‌గుప్తా, రేమండ్ హర్‌వుడ్, శ్యామ్, అజయ్‌రాజు, శ్రీనివాస్, అభిజిత్, నిర్మల, బస్తీవాసులు పాల్గొన్నారు.

## హుండీ లెక్కింపు..



సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో ఆలయ ఈవో శ్రీనివాస్‌రాజు, సూపరింటెండెంట్ కటకం శ్రీనివాస్‌గౌడ్, ప్రధానార్చకుడు పరాశరం రవీంద్రాచార్యులున్నారు. 50 రోజులకు ఆలయంలోని 20 హుండీల ద్వారా రూ.3.21లక్షల ఆదాయం సమకూరింది. లెక్కింపులో భక్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**– అమీర్‌పేట్, మార్చి 27**

# బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు నాయకులు

సికింద్రాబాద్, మార్చి 27: బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్‌ను పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మోండా మార్కెట్, టకారా బస్తీలోని పద్మారావుగౌడ్ నివాసానికి పలువురు నాయకులు చేరుకుని మద్దతు తెలిపారు. అనంతరం పజ్జన్నను ఘనంగా సన్మానించారు. సికింద్రాబాద్ జిల్లా బీఎస్పీ మాజీ అధ్యక్షుడు రుద్రవరం సునీల్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. పజ్జన్న మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ఎంపీగా గెలిచేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, పిల్లి జగన్ గంగపుత్ర, వేల్పుల రవితేజ, కొంపల్లి రఘు, ఆశ, పరమేశ్, రహీంఖాన్, శివలింగం, రాజు, మోత్కూర్ కుమార్, అందోల్ బాబు, ప్రశాంత్, పృథ్వీరాజ్, అబ్దుల్ మాజీద్ తదితరులు పాల్గొన్నారు.



పద్మారావును కలిసి బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకులు



కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థి మల్లు రవిని బుధవారం కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి గోపాల్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరినట్టు తెలిపారు.

**– కంటోన్మెంట్, మార్చి 27:**




ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించిన బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

## బీజేపీ ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

మారేడ్‌పల్లి, మార్చి 27: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. బుధవారం మహేంద్రహిల్స్‌లో ఎన్నికల ప్రచార రథాలను బీజేపీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. దేశ ప్రజలందరూ ప్రధాని మోదీని ఆదరిస్తున్నారని అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్‌లో అభివృద్ధి జరగాలంటే బీజేపీకి ఓటు వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కోకన్వీనర్ జేవీ నర్సింగ్‌రావు, కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయనంద్, నాయకులు సతీశ్, విజయ్, రాజ మల్లేశ్, శంకర్, అజయ్ గౌడ్, ప్రశాంత్, అరుణ్, టోపి శంకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి పర్యటన



కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో బుధవారం పర్యటించారు. కళాసిగూడలో సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్న అనంతరం రవాణా వాహనాల యజమానులు, యూనియన్ నేతలతో కాబ్రా కాంప్లెక్స్‌లో సమావేశమయ్యారు. అనంతరం డివిజన్‌లోని ఏబీపీ నైపుణ్యాభివృద్ధి కార్యాలయాన్ని సందర్శించి శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఎంఏ మాజీ ఉపాధ్యక్షుడడు మర్రి శశిధర్ రెడ్డి, మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల ప్రతాప్, ఆనంద్ వ్యాస్ తదితరులు పాల్గొన్నారు. **– బేగంపేట్, మార్చి 27**

## ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం: మంద కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బన్సీలాల్‌పేట్, మార్చి 27: ఎస్సీ వర్గీకరణ సాధించడమే మాదిగల రాజకీయ ఎజెండా అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. న్యూబోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సదస్సులో ఆయన మాట్లాడారు. గతంలో అనేక కమిషన్లు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు సమర్పించాయని అన్నారు. మాదిగలందరూ ఐకమత్యంగా ఉండాలని, రాజకీయ చైతన్య సాధన కోసం ఉద్యమించాలని ఆయన కోరారు. వర్గీకరణకు అనుకూలంగా ఉన్న మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలని అన్నారు. సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌మాదిగ, జాతీయ కోఆర్డినేటర్ రాగటి సత్యం మాదిగ, సోమశేఖర్, భిక్షపతి, జానకి రామయ్య, మల్లికార్జున్, నర్సింహారావు, రాజు, సుజాత, మేఘన, సీతారాం, సతీశ్, సచ్చీంద్ర, బీజేపీ నాయకులు ఎస్వై గిరి, శారద, కేఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్టు

**- ఇద్దరు రిమాండ్, జువైనల్ హోంకు మరో ఐదుగురు**

మారేడ్‌పల్లి, మార్చి 27: సెల్ ఫోన్ దొంగతాలకు పాల్పడుతున్న ముఠాను గోపాలపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముఠా సభ్యుల్లో ఐదుగురు మైనర్లను జువైనల్ హోంకు తరలించారు. నిందితుల నుంచి 6 సెల్‌ఫోన్లు, ఒక ఆటో రిక్షాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టలోని హనుమాన్‌నగర్‌కు చెందిన కొంగ్జి జాన్సన్ (20) సెంట్రింగ్ వర్కర్. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ సోహైల్ (20) ప్రైవేటు ఉద్యోగి. సులబంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో మైనర్లతో కలిసి ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్లు దొంగిలించాలని పథకం వేశారు. జార్ఖండ్‌కు చెందిన రోషన్‌కుమార్ జీవనోపాధి నిమిత్తం నగరానికి చేరుకొని సికింద్రాబాద్‌లోని ఎస్డీ రోడ్డులో పిస్తా హౌజ్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 23న మధ్యాహ్నం 1:30 గంటలకు పని పూర్తి చేసుకొని మోండా మార్కెట్‌లోని తన ఇంటికి ఒంటరిగా రోషన్ నడచుకుంటూ వెళ్తున్నాడు. క్లాక్‌టవర్ వద్దకు రాగానే ముఠా సభ్యులు అతని చేతిలో సెల్‌ఫోన్‌తో పాటు, రూ.5వేలు చోరీ చేసి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితుడు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిఘాను ముమ్మరం చేశారు. ఈనెల 25న గోపాలపురం క్రైం పోలీసులు చిలకలగూడ చౌరస్తాలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా ముఠా సభ్యులు పట్టుబడ్డారు. పోలీసులు విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించగా, మరో ఐదుగురు బాలురను జువైనల్ హోంకు తరలించారు.

## భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

ఖైరతాబాద్: అపార్టుమెంట్‌లో పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఖైరతాబాద్ గాంధీనగర్‌లో ఉండే రాజు (35) భవన నిర్మాణ కార్మికుడు. అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలోని తిరుమల అపార్ట్‌మెంట్స్‌లోని 8వ అంతస్తులో పనిచేస్తుండగా కిందపడిపోయాడు. తోటి కార్మికులు దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

- నిరుద్యోగులపై భారం మోపొద్దని బీఆర్‌ఎస్వీ నాయకుల విజ్ఞప్తి
- బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంత్రిని కలిసిన నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 27: రాష్ట్రంలో చాలా కాలం తరువాత నిర్వహిస్తున్న టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. టెట్ సూపరింటెండెంట్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ అధిక ఫీజుతో నిరుపేద అభ్యర్థులపై పెనుభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టెట్ ఫీజు ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.300 చొప్పున ఉండేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఒక పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2000కు పెంచడంతో నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికే కోచింగ్, శిక్షణ, హాస్టల్ ఫీజులకే వేలకు వేలు ఖర్చు పెడుతున్న అభ్యర్థులకు ఇది మరింత భారంగా మారనుందని అన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగుల నుంచి ఎటువంటి ఫీజులు వసూలు చేయబోమని హామీ ఇచ్చి, ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు. తక్షణమే ఫీజును తగ్గించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థి, నిరుద్యోగులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు నాగేందర్, అవినాశ్, శ్రీకాంత్, రాకేశ్, క్రాంతి, జాన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**టెట్ అర్హత ఫీజును తగ్గించాలి: బీసీ విద్యార్థి సంఘం**

ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ అర్హత పరీక్షా ఫీజును తగ్గించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీజు పెంపుతో నిరుద్యోగులపై ఆర్థికంగా పెనుభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే పాఠశాల కమిషనర్, డైరెక్టర్ దేవసేనకు ఫోన్ చేసి మాట్లాడి ఫీజును తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా చూస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు స్వామిగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సురేశ్, రాజేందర్, పండరి, బద్రి, రాజశేఖర్, మహేశ్, పవన్, కిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు బైక్ చోరీ

వెంగళరావునగర్, మార్చి 27: ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు పార్కింగ్ చేసిన హోంగార్డు ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. ఎస్ఆర్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. జీడిమెట్ల చెరుకుపల్లికాలనీకి చెందిన మాహుసుబాని(36) ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పీఎస్‌లో హోంగార్డు. ఈనెల 24న ఉదయం 9:30 గంటలకు డ్యూటీకి వచ్చి ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పీఎస్ ముందు తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. డ్యూటీ పూర్తయ్యాక అదేరోజు రాత్రి 9 గంటలకు చూడగా బైక్ లేదు. చోరీకు గురైందని గ్రహించిన బాధితుడు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

శంషాబాద్ రూరల్, మార్చి 27 : పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం శంషాబాద్ పట్టణంలో ఎస్ఎఫ్‌ఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యదర్శి శంకర్, అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ.. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



**రాజేంద్రనగర్ నూతన కమిటీ ఎన్నిక**

ఎస్ఎఫ్‌ఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రసాద్‌చారి, కార్యదర్శిగా కౌశిక్, ఉపాధ్యక్షుడిగా సోహైల్, జయశ్రీ, అర్జున్, వెనుప్రకాశ్, సహాయ కార్యదర్శిగా వైష్ణవి, తరుణ్, రోహిత్, అనుష్క, కమిటీ సభ్యులుగా శ్రీకాంత్, శివ, హర్ష, సాయిరాజ్, చరణ్, వంశీలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## గంజాయి రవాణా.. నిందితుడి అరెస్ట్

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఒడిశా కేంద్రంగా నగరానికి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.25లక్షల విలువజేసే 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జితేంద్ర నహక్ ఉపాధి కోసం నగరానికి వచ్చి స్విగ్గి డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఒడిశాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలుచేసి.. నగరంలో ఉన్న కస్టమర్లకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి, నగరానికి తరలిస్తుండగా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం సికింద్రాబాద్ ప్రాంతంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.25లక్షల విలువజేసే 5కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## ఆకట్టుకున్న ఎవ్వరిది పాపం? నాటిక



ప్రపంచ రంగ స్థల దినోత్సవం సందర్భంగా తెలుగు నాటక సమితి ఆధ్వర్యంలో సైఫాబాద్ ఏజీ కార్యాలయంలోని రంగస్థలం ఆడిటోరియంలో 'ఎవ్వరిది పాపం' నాటికను ప్రదర్శించారు. రచయిత పద్మలతా జయరాం రచించిన ఈ నాటికకు మంజునాథ దర్శకత్వం వహించారు. ఓ ఫ్లాట్‌లో నివసిస్తూ హత్యకు గురైన ఒంటరి మహిళ చుట్టూ కథ సాగుతుంది. పోలీసులు హత్య ఉదంతాన్ని ఛేదించి నిందితులను అరెస్టు చేయడంతో కథ ముగుస్తుంది. ఈ ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం రక్తికట్టించింది. అనంతరం తెలుగు నాటక సమితి అధ్యక్షురాలు బీవీ వరలక్ష్మి నటీనటులకు జ్ఞాపికలను అందజేశారు. **– ఖైరతాబాద్**